క్లుప్తంగా

కొలతల ప్రకారం పనులు చేయాలి



వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని శ్యాంపురంలో శనివారం జరిగిన ఉపాధి పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. వేతనదారుల మస్తర్లు చూసి, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని, రెండు పూటలా పనులు చేయించాలని తెలిపారు. రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలన్నారు. ఆయన వెంట ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయొద్దు

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ ప్రజలకు సూచించారు. మండలంలోని అప్పాపురం, లక్ష్మీపురం, వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వండానపేట గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన.. ప్రజలు తాగునీరు వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. తాగునీటి కుళాయిల వద్ద బట్టలు ఉతకడం, ఇళ్ల నిర్మాణాలకు కుళాయి నీటిని వినియోగించడం వంటివి చేయరాదన్నారు.

దాతలకు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అమ్మవారి కాలనీలో ఇటీవల మృతి చెందిన చెక్క ఇందుమతి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అభినందిస్తూ శనివారం ప్రశంసాపత్రం అందజేశారు. నేత్రదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ నేత్ర, రక్త, అవయవదానానికి ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, కె.ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

రేగిడి: స్వయంశక్తి సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం గోవిందరావు సూచించారు. మండలంలోని బాలకవివలస, మునకలవలస, కొర్లవలస గ్రామాల్లోని సంఘాల మహిళలతో శనివారం సమావేశమైన ఆయన.. క్రమం తప్పకుండా నెలవారీ చెల్లించాల్సిన రుణాలు చెల్లించాలని తెలిపారు.

చిత్తడి నేలలను పరిరక్షిద్దాం



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. జీవరాశి మనుగడకు చిత్తడి నేలలే ఆధారమని, సర్వమానవాళి సృష్టించిన కాలుష్యమే చిత్తడి నేలలకు ప్రమాదమని, కాలుష్య కారకాలను తగ్గిద్దాం.. చిత్తడి నేలలను పరిరక్షిద్దామని విద్యార్థులు, సిబ్బంది అంతా నినాదాలు చేశారు. అనంతరం చిత్తడి నేలల ప్రాముఖ్యతను వివరించారు. ఇదే కార్యక్రమంలో భాగంగా నేలల ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చింతా రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న పూర్వ విద్యార్థి శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని దేవుదళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కరణం శ్రీనివాసరావు అదే పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థికసాయం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో నాడు-నేడు పథకం కింద బాలికల కోసం పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. అయితే నిధుల కొరత కారణంగా ఇప్పటివరకు ఆ నిర్మాణం పూర్తి స్థాయిలో జరగలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు నిర్మాణ పనుల పూర్తికి రూ.25 వేలను శనివారం అందజేశారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి.. ఆయనకు అభినందనలు తెలిపారు.

- ఓవర్ లోడు వాహనాలతో యమడేంజర్
- నిబంధనలు బేఖాతారు చేస్తూ రాకపోకలు
- తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న వైనం
- ఆరు నెలల్లో ప్రమాదం బారిన 40 మంది
- పోలీసులు హెచ్చరిస్తున్నా ఫలితం శూన్యం

అధిక లోడు.. ప్రమాదాల జోరు!



రాజాం పట్టణంలో రాత్రి వేళలో కలప లోడు ట్రాక్టరు ఇలా..

రాజాం: అధిక లోడు వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అటు వాహనదారులు.. ఇటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజాం పట్టణంతో పాటు రాజాం పరిసర ప్రాంతాల్లో ఇసుక, కంకర, కలప వంటి సామగ్రితో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. అయితే ఆయా వాహనాల యజమానులు గానీ వాహనం నడిపేవారు గానీ కనీస నిబంధనలు పాటించకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు, వాహనదారులు ఈ ప్రమాదాల బారినపడి చనిపోవడమో, గాయపడడమో జరుగుతోంది. ఆయువు తీసే మృత్యు శకటాల మాదిరి రోడ్లపై అవి పరుగులెడుతుంటే జనం బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఆ వాహనాలు వస్తున్నాయంటే చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, ప్రయాణం చేయాల్సిన దుస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిబంధనలు అతిక్రమిస్తూ కలప రవాణా



ప్రమాదకరంగా కలప తరలింపు

నెలకు 30 ప్రమాదాలు..

రాజాం పట్టణ సరిహద్దు ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. నెలరోజుల క్రితం కంచరాం సమీపంలో చీకటిలో కలప ట్రాక్టరు ఆగి ఉండడంతో ప్రమాదం జరిగి, ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. అంతకుముందు వంగర మండలంలో ఓ ఆటోను కలప ట్రాక్టరు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఇలాంటి ఘటనలపై రాజాం సర్కిల్ పరిధిలో నెలకు 30 వరకు కేసులు నమోదవుతున్నాయి. అనధికారికంగా వీటి సంఖ్య చాలా ఎక్కువగానే ఉంది. రాజాం పట్టణంలో సాధారణ వాహనాల కన్నా కలప, ఇసుక, ఇటుకలు, ఊక, చెరకు వంటి లోడులతో ట్రాక్టర్లు, లారీలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ముఖ్యంగా రాజాం చుట్టుపక్కల ప్రాంతాల రైతులు తమ కలపను కోతకు రాజాంలోని టింబర్ డిపోకు తరలిస్తారు. ఇలాంటి వాహనాల రాకపోకలు రాత్రి సమయంలో అధికంగా ఉంటాయి. అలాంటప్పుడు వాహనం వెనక రేడియం స్టిక్కర్లు గానీ రేడియంతో తయారు చేసిన నంబర్ ప్లేట్లు గానీ ఉపయోగించాలి. కానీ అవేమీ కానరావడం లేదు. దీనికితోడు కలప లోడు వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఆరు నెలల వ్యవధిలో కలప రవాణా ట్రాక్టర్ల కారణంగా ప్రమాదానికి గురైన వారు 40 మంది వరకు ఉన్నారు. ఇంత జరుగుతున్నా ఆయా వాహనాల యజమానుల్లో గానీ, వాహనదారుల్లో గానీ మార్పు కనిపించడం లేదు. నిబంధనలు బేఖాతరు చేస్తూ తమ వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు తప్పకుండా నిబంధనలు పాటించాలని హెచ్చరిస్తున్నా పాటించడం లేదు.

అవగాహన కల్పిస్తున్నా..

రాజాంతో పాటు రాజాం చుట్టుపక్కల ప్రాంతాల్లో కలప రవాణా ట్రాక్టర్ల యజమానులకు, వ్యాపారులకు పోలీసులు ఇటీవల అవగాహన కల్పించారు. కలప లోడుతో ఉన్న ట్రాక్టర్లను రోడ్డు పక్కన పార్కింగ్ చేయరాదని, వాటి వెనకభాగంలో రేడియం స్టిక్కర్లు ఉంచాలని ఆదేశించారు. అయితే వారి ఆదేశాలను ఏ ఒక్క ట్రాక్టరు యజమాని అమలు చేయడం లేదు. ఫలితంగా ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రధానంగా శ్రీకాకుళం, బొబ్బిలి, పాలకొండ రోడ్లలో కలప లోడు వాహనాల కారణంగా ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పగటి వేళల్లో తరలించాలి..



కలప రవాణా చేసే ట్రాక్టర్లు కచ్చితంగా పగటి వేళల్లోనే తిరగాలి. వెనకభాగాన రేడియం స్టిక్కర్లు పెట్టుకోవాలి. అధిక లోడుతో ప్రయాణించరాదు. నిబంధనలు అతిక్రమించి ఇసుక, చెరకు, ధాన్యం తదితర వంటివి రవాణా చేస్తున్న వాహనాల యజమానులు ఒకసారి ఆలోచించాలి. లేకపోతే చర్యలు తప్పవు.

– హెచ్.ఉపేంద్ర, సీఐ, రాజాం రూరల్

పరామర్శ

సంతకవిటి: మండలంలోని మంతిన ఎంపీటీసీ సభ్యులు మూల రమణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు ఎంపీటీసీ స్వగ్రామం మల్లయ్యపేటకు శనివారం వెళ్లి, ఆమె కుమారులు మూల వెంకటరమణ, కృష్ణలను పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, కళింగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి. స్వామినాయుడు, సర్పంచ్ ఎస్.ఈశ్వరరావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వి.రమణారావు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, తాలాడ ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, వై.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు జి.షణ్ముఖరావు, డి.దాలినాయుడు, పి.గణపతి, పి.ఈశ్వరరావు, మందరాడ ఎంపీటీసీ వి.శ్రీనివాసనాయుడు, డాక్టర్ నరేంద్ర పాల్గొన్నారు.



ఎంపీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ తలే రాజేష్

పశువైద్య సేవలు

రేగిడి: మండలంలోని సంకిలి, రేగిడి పశువైద్య కేంద్రాల పరిధిలోని వండానపేట, వెంకంపేట, కొత్తచెలికానివలస తదితర గ్రామాల్లో పశువైద్య శిబిరాలు శనివారం నిర్వహించారు. శిబిరానికి తీసుకువచ్చిన 875 పశువులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వాటికి మందులు అందజేశారు. కార్యక్రమంలో రేగిడి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు

బాడంగి: మండలంలో పలుచోట్ల సర్వర్లు సక్రమంగా పనిచేయని కారణంగా శనివారం పింఛన్ల పంపిణీ ఆలస్యమైంది. దీంతో సామాజిక పింఛన్‌దారులంతా రెండు గంటల కాలం పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పింఛన్ డబ్బులు ఇస్తారని సచివాలయాలు, రచ్చబండల వద్దకు ఉదయం 6:30 గంటలకు చేరుకున్న లబ్ధిదారులంతా పింఛన్ కోసం పడిగాపులు కాశారు. ఎట్టకేలకు ఉదయం 8:30 గంటలకు సర్వర్లు మళ్లీ పనిచేయడంతో సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు పింఛన్ డబ్బులు పంచిపెట్టారు.

ట్రాక్టర్లు వితరణ

రాజాం: పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లికార్జునరావు.. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో చెత్త సేకరణకు రెండు కొత్త ట్రాక్టర్లను వితరణ చేశారు. వీటిని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడుకు శనివారం అందజేశారు. ఇటీవల రాజాం వచ్చిన జీఎంఆర్‌ను కలిసి చెత్త సేకరణకు ట్రాక్టర్లు కావాలని కోరామని, ఆయన స్పందించి, రెండు ట్రాక్టర్లు సమకూర్చారని కమిషనర్ తెలిపారు. ఇక్కడ సేకరించిన చెత్తను విశాఖపట్నంలోని జిందాల్ సాలిడ్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్లు అందజేస్తున్న జీఎంఆర్‌వీఎఫ్ ప్రతినిధులు

స్త్రీనిధి మళ్లింపుపై విచారణ



పొదుపు సంఘాల సభ్యులను విచారణ చేస్తున్న ఏపీఎం భాగ్యలక్ష్మి

బొబ్బిలిరూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామంలో పొదుపు సంఘాల స్త్రీనిధి రుణాల డబ్బులు పక్కదారి మళ్లింపుపై వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మి శనివారం విచారణ చేపట్టారు. గ్రామంలోని కొన్ని సంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణాలు మంజూరు కాగా, వాటిని అర్హులైన వారికి ఇవ్వకుండా ఇతరులకు ఇచ్చినట్లు పలువురు సభ్యులు ఏజీఎం ..కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇటీవల ఏజీఎం చేపట్టిన విచారణలో కొంత గందరగోళం ఏర్పడగా, విచారణను వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ ఏపీఎం ఆధ్వర్యంలో విచారణ ప్రారంభం కాగా, త్వరలోనే నిధుల మళ్లింపుపై వివరాలు తెలియజేస్తామని ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో సీసీలు కోటేశ్వరరావు, తవిటినాయుడు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

బొబ్బిలి: పట్టణంలో రైల్వే మూడో లైను నిర్మాణ పనులకు విచ్చేసిన కార్మికులకు పట్టణానికి చెందిన వనమిత్ర అధ్యక్షుడు కృష్ణదాసు మాస్టారు నిత్యావసర సరుకులు శనివారం అందజేశారు. ఈ మేరకు సదరు కార్మికులంతా దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పాలవలస శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న పాలవలస శ్రీనివాసరావు, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: పట్టణంలోని ఆదినారాయణకాలనీ వద్ద వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున పార్టీ నాయకులు, ఆయన అభిమానులంతా శ్రీనివాసరావు ఇంటి వద్దకు చేరుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను ఆయన భార్య రాజాం ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతిలను సత్కరించి, బర్త్‌డే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రాజాం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ప్రారంభించారు. రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ దాతల నుంచి రక్తం సేకరించారు. అంతకుముందు పార్టీ చీపురుపల్లి నాయకుడు బెల్లాన వంశీకృష్ణ, రాజాం పట్టణ నాయకులు ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు. విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి, శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో పలువురికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. పేదలకు వస్త్రదానం, అన్నదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో రాజాం పట్టణంతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గంధం.. భరించలేం!



రాజాంలోని వస్త్రపురికాలనీ బాలాజీనగర్‌లో నెలకొన్న మురుగు నీటి నిల్వల కారణంగా దుర్గంధం వెదజల్లుతోంది. అటువైపుగా వెళ్లే వారంతా ముక్కులు మూసుకుని మరీ వెళ్లాల్సి వస్తోంది. సీసీ రోడ్లు, కాలువలు లేకపోవడంతోనే ఈ దుస్థితి అని, అధికారులు స్పందించి ఆయా నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తమ సమస్యను మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు కూడా ఇటీవల ఫిర్యాదు చేశామని కాలనీవాసులు తెలిపారు. దుర్వాసన భరించలేమని, ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని అనిపిస్తోందన్నారు.

–రాజాం

మత్తుతో జీవితం చిత్తు



గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తుపదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని, విద్యార్థులు, యువత అంతా వాటికి దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా రాజాం బస్టాండ్ వద్ద ప్రచార రథం ద్వారా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, మంచి అలవాట్లు, నడవడిక అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం సైబర్‌నేరాలు, రోడ్డు భద్రతా నియమాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.రవికిరణ్, ఏఎస్ఐ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేతల విగ్రహాలకు ముసుగు



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున రాజాం పట్టణంలోని పలు పార్టీ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. రాజకీయ పార్టీల నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించారు. పక్కాగా ఎన్నికల నియమావళి పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు.

–రాజాం

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

సంతకవిటి: మండలంలోని గోవిందపురంలో శ్రీసీతారామచంద్ర ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రాయగడకు చెందిన ప్రముఖ వేద పండితులు రేజేటి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పురోహితులు పులఖండం శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో వేద పండితులు రేజేటి శ్రీరామశర్మ, వేమకోటి నాగభూషణశర్మ, వేమకోటి సతీష్‌శర్మ, పులఖండం శ్రీకాంత్‌శర్మ, రంప సంతోష్‌కుమార్‌శర్మలు గ్రామ ప్రదక్షిణ, వినాయకపూజ, పుణ్యాహవచన పరిషత్-ప్రాయశ్చిత్తం, పంచాగవ్య ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, అంకురారోపణ, ధ్వజ పతాకావిష్కరణ, జలాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. 250 మంది భక్తులు శ్రీరామ దీక్ష చేపట్టారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెళ్లికి వచ్చిన వారికి ఊహించని బహుమతి

రాజాం సిటీ: తన పెళ్లికి వచ్చిన అతిథులకు ఊహించని బహుమతి అందించాడో వరుడు. పెళ్లికొడుకు వినూత్న ఆలోచనకు కాసేపు షాక్ అయినా అతడి మంచి ఆలోచనను అందరూ అభినందించారు. వివరాలిలా ఉన్నాయి.. రాజాం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో పట్టణానికి చెందిన సూరజ్ వివాహం శనివారం జరిగింది. పర్యావరణ పరిరక్షణకు నేను సైతం అంటూ ఆ పెళ్లికొడుకు.. తన వివాహానికి వచ్చిన వారందరికీ మొక్కలను బహుమతిగా అందించాడు. శుభకార్యంలో ఆయన చేసిన మంచి పనిని అంతా మెచ్చుకుని, వివాహ శుభాకాంక్షలు తెలిపారు.



అతిథులకు మొక్కలను బహుమతిగా అందిస్తున్న దృశ్యం

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

వంగర: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని ఎంఈవో వై.దుర్గారావు తెలిపారు. మండలంలోని మడ్డువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చేపడుతున్న కబడ్డీ, వాలీబాల్ కోర్టుల నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. పీఎంశ్రీ ద్వారా మంజూరైన రూ.1లక్ష నిధులతో కోర్టుల నిర్మాణం జరుగుతోందన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు

సంతకవిటి: మండలంలోని రంగారాయపురంలో షిర్డీసాయిబాబా ఆలయ 21వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు సాయివ్రతాలు చేపట్టారు. గ్రామస్తులతో పాటు వాసుదేవపట్నం, పోతులజగ్గపేట, తమరాం, మేడమిర్తి, బూరాడపేట, హొంజరాం, గోల్లవలస, శ్రీకాకుళం జిల్లాలోని లాబాం, గుత్తావల్లి, లంకాం, నారాయణపురం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.



పూజలందుకున్న షిర్డీసాయిబాబా

బిల్లులు రాలేదని పనులు ఆపొద్దు



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న పీఆర్ డీఈఈ అప్పారావు

బాడంగి: పల్లెపండుగ పనులకు సంబంధించి, బిల్లులు రాలేదని పనులు నిలిపివేయడానికి వీలు లేదని పంచాయతీరాజ్ డీఈఈ సీహెచ్ అప్పారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పల్లెపండుగ అభివృద్ధి పనులపై శనివారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా జరుగుతున్న పనులపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆరాతీశారు. మండలంలో మొత్తం రూ.6 కోట్ల విలువైన 89 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 60 పనులు పూర్తయ్యాయని ఏఈ రమేష్ తెలిపారు.